క్లుప్తంగా

అభివృద్ధి పనులకు సముచిత ప్రాధాన్యత



చిలకలూరిపేట: అభివృద్ధి పనులకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణంలోని 27వ వార్డులో తిరుపతమ్మ గుడి వద్ద రూ. 16 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వార్డులను మౌలిక వసతుల కల్పనకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రాధాన్యతాక్రమంలో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లోనూ అవసరమైన పనులను గుర్తించి అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ అన్నపరెడ్డి శ్రీలక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు షేక్ బక్షు మేస్త్రి, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకటరమణ, పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని అన్ని గ్రామాల్లో గల నిరుద్యోగులకు వినుకొండకు చెందిన ఆశా సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ అండ్ కాల్ సెంటర్, కంప్యూటర్ ట్రైనింగ్ 60 రోజుల కోర్సును ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, శిక్షణ అనంతరం సర్టిఫికెట్, ఉద్యోగ అవకాశం కూడా కల్పించడం జరుగుతుందన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల వయసుగల వారు ఉపయోగించుకోవాలని కోరారు. వివరాలకు 7670985218, 9494993755, 6303434077 నంబర్లను సంప్రదించాలన్నారు.

పాము కాటుతో వ్యవసాయ కూలీ మృతి

శావల్యాపురం: పాము కాటుకు గురై వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని ఇర్లపాడు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొత్త గోర్ల సూజాత (34) మొక్కజొన్న పొలంలో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు పాము కాటు వేసింది. చుట్టు పక్కల కూలీల గమనించి సత్వరమే నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అయితే రెండు రోజుల నుంచి వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం తుది శ్వాస విడిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వపరంగా వైఎస్సార్ బీమా రూ. 5 లక్షల పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మృతురాలికి ఇద్దరు సంతానం. నివాళి అర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ సైదా, వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ వెలగపూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్హులైన వారికి అభివృద్ధి సంక్షేమ పథకాలు అందించాలి

వినుకొండ(నూజెండ్ల): ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికి అందించేందుకు అధికారులు కృషి చేయాలని ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జి. సుందరరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్ పనులు, విద్యుత్ సమస్యలు, వైద్య, ఆరోగ్య శాఖ, మహిళా శిశుసంక్షేమం, పలు శాఖల అధికారులతో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై చర్చించారు. గ్రామ సచివాలయాల్లో పరిధిలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ టీసీ సూరాబత్తుని విజయలక్ష్మి రాజాతో పాటు మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అమీన్ సాహెబ్‌పాలెంలో ధ్వజస్తంభ వార్షికోత్సవం

నాదెండ్ల: మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామంలో కొలువైయున్న శ్రీ కోదండ రామ స్వామి ఆలయ ధ్వజస్తంభ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత కనమర్లపూడి రామబ్రహ్మం, ఆలయ పూజారి రామలింగశాస్త్రి ఆధ్వర్యంలో ఆలయానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులగోత్రనామ పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయం నిర్మించి ఐదు దశాబ్దాలు పూర్తయి 2015లో ఆలయంలో గ్రామస్తుల సహకారంతో ధ్వజస్తంభాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది కార్తీకమాసం మొదటి సోమవారం వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ అన్నదాన కార్యక్రమం చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం

చిలకలూరిపేట: ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించాలని రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షుడు కాపు వెంకటరావు చెప్పారు. గుంటూరులోని విక్టోరియా పారా మెడికల్ ఇనిస్టిట్యూట్‌లో అనస్థీసియా కోర్సులో డిప్లమా మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పి.బిందు అనితకు క్లబ్ ఆధ్వర్యంలో ఫీజు నిమిత్తం రూ. 50 వేలు ఆర్థిక సహాయం అందించారు. జాగర్లమూడి జ్యోతిర్మయి అందించిన ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఆళ్ల వేమనరెడ్డి, సభ్యులు కందిమళ్ల సాంబశివరావు, యూసుఫ్అలి, ముక్తార్ అహమ్మద్,గల్లా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ బస్సు యాత్రలో నాయకుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, మంత్రి నాగార్జున



మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



ముఖ్యమంత్రి జగనన్న, ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి చిత్రాలతో యాత్రలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ అభిమానులు



బస్సు యాత్రలో అందిర్నీ ఆకట్టుకున్న తీన్‌మార్ కళాకారుల ప్రదర్శన

ఇచ్చిన హామీలు ముఖ్యమంత్రి నెరవేర్చారు

- నాదెండ్ల ఎంపీపీ, జెడ్పీటీసీ
- వేర్వేరు ప్రాంతాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

నాదెండ్ల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చి మరోసారి ఓట్ల కోసం ప్రజల్లోకి వెళ్తున్న పార్టీ వైఎస్సార్ సీపీ అని ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. మండలంలోని ఎండుగుంపాలెం గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.10,57,24,634లు నిధులు ఖర్చు చేసినట్లు పైలాన్ ఆవిష్కరించారు. నవరత్నాల పథకాల్లో భాగంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇంటి స్థలం కేటాయించి ఇళ్లు నిర్మించి ఇస్తున్నారన్నారు.సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగ సమస్యను తీర్చారన్నారు. ఇళ్ల వద్దకే రేషన్, పెన్షన్ అందిస్తున్నారని, అమ్మ ఒడి, విద్యాదీవెన, మనబడి నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్య అందిస్తున్నారన్నారు. విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు అందించటంతో వారు చదువులో మంచి ప్రతిభ చూపుతున్నారన్నారనీ, విద్య, వైద్య రంగాలకు విశిష్ట ప్రాధాన్యతనిచ్చారన్నారు. అనంతరం మిట్టమీద వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. పలు కాలనీల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, నాదెండ్ల, గణపవరం సొసైటీల అధ్యక్షులు కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, ఎంపీటీసీ సూరె సరస్వతి, గ్రామ పార్టీ నాయకులు పర్వతనేని బ్రహ్మయ్య, మొక్కపాటి శ్రీను, యార్డు డైరెక్టర్ దావల రత్నకుమార్, సూరె బుచ్చయ్య, గుర్రం ఉపేంద్ర, గద్దె కోటయ్య, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జానీ బాషా, ఐటీసీ శ్రీను ఉన్నారు.

జగనన్న ఆధ్వర్యంలోనే సంక్షేమం

బొల్లాపల్లి: మండలంలోని కనుమలచెరువు గ్రామసచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తి గురవయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీ బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు మట్టి రాజయ్య, రామావత్ కృష్ణానాయక్, భూక్యా ప్రశాంత్ నాయక్, అంజానాయక్ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు తెలిపే బోర్డును ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని పురస్కరించుకుని అధికారులు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలు గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనుమలచెరువు సచివాలయం పరిధిలో రూ.19.22 కోట్ల మేర లబ్ధి చేకూరిందని 1040 మందికి లబ్ధిదారులకు సంక్షేమం గడపగడపకు చేరిందని తెలిపారు. పేదలకు వైఎస్సార్ సీపీ అండగా నిలిచిందని, అమ్మఒడి, రైతు భరోసా, విద్యార్థులకు విద్యాకానుక, విద్యాదీవెన వంటి అనేక పథకాలు ప్రవేశపెట్టి నూటికి 90 శాతంకు పైగా పథకాలు అమలు చేసిన ఘనత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని చెప్పారు. రాబోయే కాలంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే సంక్షేమం వర్ధిల్లిందని, జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మరోమారు ఎన్నుకోవాలని తెలిపారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు పార్టీ కన్వీనర్ మట్టి రాజయ్య, బత్తి గురవయ్య, రామావత్ కృష్ణానాయక్‌లు గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకుల ఇంట్లో నిద్ర కార్యక్రమం చేపట్టారు.



చిలకలూరిపేటలో సంక్షేమ పథకాల వివరాల బోర్డు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నే కావాలి

చిలకలూరిపేట: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాష్ట్రానికి వైఎస్ జగనే ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు చెప్పారు. పట్టణంలోని 19,37 వార్డులతో పాటు మండలంలోని బొప్పూడి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమం, అభివృద్ధి బోర్డులను ఆవిష్కరించారు. సమీప ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ జెండాలను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో లబ్ధి పొందని కుటుంబం లేదని వెల్లడించారు. కులం, మతం, పార్టీ, వర్గం వంటి విభేదాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని చెప్పారు. విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తూ పేదలు, సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని పేర్కొన్నారు. ఇంతటి ప్రజారంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ, మళ్లీ రావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు క్లస్టర్-1 పఠాన్ తలహాఖాన్, క్లస్టర్ -2 విడదల కమలేంద్ర, 19వ వార్డు కౌన్సిలర్ షేక్ నసీమా బేగం, ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, పాల్గొన్నారు.

పేదల జీవన ప్రమాణాలు జగన్‌తోనే మెరుగు

యడ్లపాడు: పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే ధ్యేయంగా కులమత, పార్టీ, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలంతా ముక్తకంఠంతో కోరుకుంటున్నారని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఘంటా శంకర్ చెప్పారు.



ఎండుగుంపాలెంలో సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

మండల జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు నేతృత్వంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం తిమ్మాపురంలో సోమవారం జరిగింది. ముందుగా సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డు, పార్టీ పతాకాన్ని శంకర్‌తో పాటు ఎంపీపీ పిడతల ఝాన్సీ, పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగినా నవరత్న పథకాలను సీఎం జగన్ అమలు చేసి సంక్షేమానికి సరికొత్త నిర్వచనం తీసుకు వచ్చారన్నారు. తిమ్మాపురం గ్రామ సచివాలయం పరిధిలో నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఆధ్వర్యాన జగనన్న ప్రభుత్వంలో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి రూ.40,82,65,558 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. వీటిలో 33 సంక్షేమ పథకాల నిమిత్తం డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా రూ.38,10,15,588 కోట్లు ఉండగా, వివిధ అభివృద్ధి పనులకు రూ.2,72,50,000 కోట్ల వెచ్చించినట్లు తెలిపారు. వీటిలో నాడు-నేడు కింద పాఠశాలలు, ఆసుపత్రులకు రూ.1.66 కోట్లు, గడపగడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన సమస్యలకు రూ.20 లక్షలు, గ్రామ సచివాలయ భవన సముదాయానికి రూ.82 లక్షలు, ఇతర అభివృద్ధి పనులకు రూ.4.50 లక్షల అభివృద్ధి చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రామపార్టీ నాయకులు పావులూరి శ్రీనివాసబాబు, ముద్దన పుల్లయ్య, రావూరి రామారావు, చిన్న వెంకయ్య, కొప్పుల శామ్యేల్‌పాల్, బద్దులూరి శ్రీనివాసరావు, బిరుదు రమేష్, ఆలోకం వెంకట లక్ష్మీనారాయణ, రావూరి వేణుగోపాలరావు, చాగంటి శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



వినుకొండ(నూజెండ్ల) : వినుకొండ కొండపై వేంచేసి ఉన్న గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా పట్టణంలోని కొత్తపేటకు చెందిన అప్పరాజు సర్వమంగళదేవి రూ.5 లక్షలు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదుగా వినుకొండ పట్టణ అభివృద్ధి సేవా సంఘంకు అందజేశారు. గతంలో ఆమె ప్రకటించిన రూ.25 లక్షల్లో రూ.5 లక్షలు అందజేసిందని సంఘం సభ్యులు తెలిపారు.కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు పెండేల పుల్లారావు, చైర్మన్ పులిపాటి రామారావు, వైస్ చైర్మన్ చందోలు మల్లికార్జునరావు, గంధం బాలిరెడ్డి, జాగర్లమూడి సుబ్బారావు, కార్యదర్శి జాజుల మాల్యాద్రి, సహాయ కార్యదర్శి దండు చెన్నయ్య, కోశాధికారి రెడ్డి నగేష్, సహకోశాధికారి కన్నెగండ్ల అనంత రామకోటేశ్వరరావు, ఈసీ మెంబరు రామ తులసిరెడ్డి, తేలికేపల్లి వెంకటేశ్వర్లు, అచ్యుత కృష్ణ, పొట్ల సుబ్బారావు, గోవిందనాయక్, పీఎస్ ఖాన్ పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి విరాళం

చిలకలూరిపేట: మత సామరస్యాన్ని ప్రతిబింబిస్తూ దేవాలయానికి విరాళం అందజేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ కృష్ణా, ఎన్‌టీఆర్, గుంటూరు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. పఠాన్ చిన సత్తార్‌ఖాన్ ట్రస్టు అధ్యక్షుడు పఠాన్ యూసుఫ్‌ఖాన్ పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో పునఃనిర్మాణంలో ఉన్న శివాలయానికి రూ. లక్ష విరాళం మర్రి రాజశేఖర్ చేతుల మీదుగా సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు ద్వారా ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు, నిరుపేదలకు సహాయం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా కులమతాలకు అతీతంగా దేవాలయానికి విరాళం అందజేయటం పట్ల ప్రశంసలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు శివసుబ్రమణ్యం, తవ్వా చలపతి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ నియోజకవర్గంగా వినుకొండను తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- రెడ్డినగర్‌లో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం

వినుకొండ(నూజెండ్ల) : నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని హనుమాన్‌నగర్-2 సచివాలయంలోని 31వ రెడ్డినగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. తొలుత ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు గజమాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం వార్డు ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంటింటికీ తిరుగుతున్నప్పుడు ప్రజలు తమకు ప్రభుత్వం అందించిన పథకాలు తెలియజేస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. వినుకొండ అభివృద్ధి గత ప్రభుత్వంతో పోల్చి చూసుకోవాలన్నారు. గత పదేళ్లలో వినుకొండ వెనుకబడిన ప్రాంతంగానే ఉందని, కనీసం తాగునీరు అందించలేని స్థితిలో గత ఉన్న స్థితినుంచి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వినుకొండకు శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత మున్సిపల్ కాంప్లెక్స్‌లు, ఎన్‌ఎస్‌పీ కెనాల్‌పై సీసీ రోడ్లు, ఘాట్ రోడ్డు నిర్మాణం, గిరిప్రదక్షిణం రోడ్డుతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత 2.31 లక్షల కోట్ల రూపాయలు సంక్షేమానికి ఖర్చు చేయడమే కాకుండా నవరత్నాల పేరుతో అన్నివర్గాలను ఆదుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఎం.ఎల్.రెడ్డి, పట్టణ అధ్యక్షులు పీఎస్ ఖాన్, కౌన్సిలర్లు షకీలా దస్తగిరి, గంటా కాలేషా, నంది నరసింహారావు, పాపసాని బ్రహ్మయ్య, ఎంఎస్‌కే బాషా, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, జడ్పీ కోఆప్షన్ మెంబరు గుండాల స్వెనోమ్, తుమ్మా వెంకటరెడ్డి, ఆరె శివారెడ్డి, సొసైటీ చైర్మన్ నాసరరెడ్డి, రొడ్డా పుల్లారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

నమఃశివాయ స్మరణతో మార్మోగిన ఆలయాలు



శావల్యాపురంలో రామలింగేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



పాతూరు శివాలయంలో కార్తిక దీపాలను వెలిగిస్తున్న భక్తులు



విద్యుత్ దీపాల అలంకరణలో విప్పర్ల శివాలయం



ప్రత్యేక అలంకరణలో వల్లభేశ్వరస్వామి

నరసరావుపేట ఈస్ట్: పవిత్ర కార్తిక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉదయాన్నే పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయాలకు చేరుకొని కార్తిక దీపాలను వెలిగించి స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. పాతూరులోని గంగా పార్వ తీ సమేత శ్రీ భీమలింగేశ్వరస్వామి ఆలయం, రావిపాడురోడ్డులోని కళ్యాణ సుందరేశ్వరస్వామి, బరంపేటలోని వాయుమల్లేశ్వరస్వామి, శృంగేరి శంకరమఠంలోని శంకర చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాలలో భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించి పూజ లు జరిపారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలో భక్తులు మొదటి కార్తిక సోమవారం వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్తిక మాసంలో శ్రవణ నక్షత్రం ఉన్న రోజును కోటి సోమవారం అని పిలుస్తారు. తెల్లవారు జామున స్నానాన్ని ఆచరించి ఉపవాసంతో పూజలు చేస్తే కోటి సోమవారాలు ఉపవాసం చేసిన ఫలితం దక్కుతుందని దేవాలయ అర్చకులు తెలిపారు. భక్తి శ్రద్ధలతో భక్తులందరూ తెల్లవారు జాము నుంచే దగ్గరలో ఉన్న శివాలయాలకు వెళ్లి దీపాలు వెలిగించి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకాశ దీప దర్శనంతో పాటు దాన ధర్మాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలంలోని విప్పర్ల, రొంపిచర్ల, వడ్లమూడివారిపాలెం, సంతగుడిపాడు, బుచ్చిబాపన్నపాలెం, పరగటిచర్ల, మాచవరం, కొత్తపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాన్ని తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు శివనామస్మరణతో భజనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

శావల్యాపురం మండలంలో...

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం, కారుమంచి, మతుకుమల్లి, వేల్పూరు, శావల్యాపురం, పోట్లూరు, తదితర గ్రామాల్లో వేంచేసియున్న శివాలయాల్లో రెండవ కార్తిక సోమవారం వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున చల్లని నీటితో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మట్టి ప్రమిదల్లో, ఆవు నెయ్యి పోసి దీపాలు వెలిగించారు. శావల్యాపురంలో వేంచేసియున్న రామలింగేశ్వరస్వామి దేవాలయంలో తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, రుద్రాభిషేకం తదితర విశేష పూజలు ఆలయ పూజారీ సాయి భరత్ ఘనంగా నిర్వహించారు. కార్తికమాసం పురస్కరించుకుని నియమనిష్టలతో భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసాలు ఉన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

- మరింత విజ్ఞానులుగా తయారుకండి
- విద్యార్థులకు సూచించిన అతిథులు
- ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని వక్తలు పేర్కొన్నారు. పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ముగిశాయి. వారం రోజులుగా విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు సోమవారం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ముగింపు సభలో బహుమతులు అందచేశారు. శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం ఎం.కోటేశ్వరరావు, క్విజ్ మాస్టర్ పి.వి.హనుమంతరావు, పద్య గద్య కవి ఈపూరి వెంకటరెడ్డి, గ్రంథాలయాధికారి యడ్లపాటి రాధ తదితరులు పాల్గొని మాట్లాడారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): స్థానిక వినుకొండ శాఖ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు షేక్ షకీలా దస్తగిరి, దిల్షాద్, ఎంఈవో ఎస్. జఫ్రుల్లా పాల్గొని గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమలారామ్, గ్రంథాలయ అధికారి భూక్యా బద్రీనాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

బొల్లాపల్లి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఆర్. సేవానాయక్, ఉపాధ్యాయురాలు మార్తమ్మ, గ్రామ పెద్దలు గురవయ్య, నారాయణరెడ్డి, లక్ష్మీరెడ్డి, అలివేలు, గ్రామీణ గ్రంథాలయ సిబ్బంది సుబ్బయ్య, మట్టయ్య, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నాదెండ్లలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ రాణి, ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్ తదితరులు

పుస్తక పఠనంతో గొప్ప జ్ఞానం

నాదెండ్ల: పుస్తక పఠనంతో గొప్ప జ్ఞానాన్ని సముపార్జించుకోవచ్చని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. నాదెండ్ల శాఖా గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ నెల 14న ప్రారంభమైన వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో గడిచిన వారం రోజులుగా విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగలక్ష్మి, ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, లైబ్రేరియన్ రావూరి శ్రీనివాసరావు, ఎంఈవో ఆంజనేయులు, హెచ్‌ఎం సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అజ్ఞానాన్ని తొలగించేది పుస్తకమే

నరసరావుపేట ఈస్ట్: ప్రజలలోని అజ్ఞానాన్ని తొలగించి వారిని వివేకవంతులుగా తీర్చిదిద్దేది పుస్తకమేనని శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త తెలిపారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని కళాశాలలోని గ్రంథాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన అరుదైన పుస్తక, ఫొటో ప్రదర్శనను వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, గ్రంథాలయాధికారి పి.రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక శావల్యాపురం గ్రంథాలయ శాఖలో సోమవారంతో ముగిసినట్లు గ్రంథాలయ అధికారి గంగవరపు అర్జున్ తెలిపారు. శ్రీరామా స్కూలు కరస్పాండెంట్ మోహన్‌చందు మాట్లాడుతూ ప్రాథమిక దశనుంచి ప్రశ్నించేతత్వం అలవరుచుకోవటంతో పాటు పుస్తక పఠనం చేయాలన్నారు.

రొంపిచర్ల మండలంలో..

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు, రొంపిచర్ల శాఖా గ్రంథాలయాలలో ఈ నెల 14 నుంచి నిర్వహిస్తున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా మండలంలో సంతగుడిపాడు శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వారోత్సవముల ముగింపు వేడుకలలో పాల్గొన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ప్రధానోపాధ్యాయులు పి.ఎల్. బాలశౌరి మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీ సమయంలో గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

యడ్లపాడు: విద్యార్థులు అన్ని విభాగాల్లోనూ పోటీ పడినప్పుడు వారిలో దాగున్న సృజనాత్మక వెలుగులోకి వస్తుందని పల్నాడు జిల్లా విజ్ఞాన కేంద్రం ఇన్‌చార్జి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి చెప్పారు. బాలల దినోత్సవం సందర్భంగా మండలంలోని 9 హైస్కూల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతి ప్రదానం చేశారు. స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్స్‌లో..కారుచోల పూజిత (కారుచోలజెడ్పీ), గాండ్ల ప్రశాంత్ (లింగారావుపాలెంజెడ్పీ), బి గాయత్రి (వంకాయలపాడుజెడ్పీ), జూనియర్స్‌లో సీహెచ్ సోనాశ్రీ (నారాయణస్కూల్), విప్పర్ల బాను (లింగారావుపాలెంజెడ్పీ), సయ్యద్ ఫైజ్‌ఆనంద్ (కారుచోల జెడ్పీ) హైస్కూల్స్‌కు చెందిన విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వీరితో పాటు ఆయా పాఠశాలల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు ప్రత్యేక ప్రశంసా జ్ఞాపికల్ని అందజేశారు.